ఈనాడు ఒడిశా

మంగళవారం సెప్టెంబరు 1, 2026 5

స్వామి ఆభరణాల లెక్కింపు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జగన్నాథుని ఆభరణాల లెక్కింపు సోమవారం జరిగింది. ఈ ప్రక్రియ మంగళవారం (1న) కూడా కొనసాగనుంది. శ్రీక్షేత్రంలోని రత్నభాండాగారం రహస్య గదిలో ప్రభుత్వం జారీ చేసిన నియమావళి (ఎస్‌ఓపీ) ప్రకారం లెక్కింపు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 వరకు జరిగింది. పర్యవేక్షణ సంఘం అధ్యక్షుడు జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాడి, ఇతర అధికారులు, నిపుణులు పాల్గొన్నారు.

నేడు దిల్లీ వెళ్లనున్న సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి మంగళవారం (1న) హస్తిన వెళ్లనున్నారు. బుధవారం దిల్లీలో ఏర్పాటయ్యే జాతీయ జలవనరుల సమ్మేళనంలో పాల్గొంటారు. కొంత మంది కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రాభివృద్ధి ప్రాజెక్టులపై చర్చిస్తారని సోమవారం భువనేశ్వర్‌లో సీఎంవో అధికారవర్గాలు తెలిపాయి.

మాజీ మంత్రి డంబురు కన్నుమూత

డంబురు మాఝి (పాతచిత్రం)

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా టెంటులికుంటి సమితి అంచల గుమ్మ పంచాయతీ చిత్రకోట్‌కు చెందిన మాజీ మంత్రి డంబురు మాఝి (86) ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన 1967, 1971, 1985 డాబుగావ్ ఎమ్మెల్యేగా, 1977, 1980 కొడింగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1990లో వ్యవసాయశాఖ మంత్రిగా వ్యవహరించారు. ఎంపీ బలభద్ర మాఝి, ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝి, మాజీ ఎంపీ పర్సురామ్ మాఝి, కాంగ్రెస్ నేత మనోరంజన్ త్రిపాఠి, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తదితరులు ఆయన మృతిపై సంతాపం తెలియజేశారు. అంతిమయాత్రలో అధికారులు, నేతలు పాల్గొన్నారు.

పోలీసుశాఖ తరఫున గౌరవ వందనం చేస్తున్న సిబ్బంది

నీట్‌లో మెరిశాడు... నిజాయతీ చాటుకున్నాడు

- 574 మార్కులు సాధించిన దినసరి కూలీ కుమారుడు
- దాతల నుంచి రూ. 50 వేలు అందాక విరాళాల తిరస్కరణ

సౌమ్యరంజన్‌ను సత్కరించిన ఓ దాత, పక్కన తల్లి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పేదరికం వెక్కిరిస్తున్నా ఎలాంటి కుంగుబాటుకు గురికాకుండా నీట్‌లో మెరిశాడు. తన దీనావస్థ గురించి తెలుసుకున్న దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుత అవసరాలకు సరిపడా రూ. 50 వేలు చేరాక, మిగతా విరాళాలను సున్నితంగా తిరస్కరిస్తూ నిజాయతీని చాటుకున్నాడు. కేంద్రపడ జిల్లా మహకల్పాద సమితి బిజయనగర్ పంచాయతీ సహబాజ్‌పూర్ గ్రామానికి చెందిన సౌమ్యరంజన్ సాహు దినసరి కూలీ కుమారుడు. ఇటీవల నీట్ ఫలితాల్లో 574 మార్కులతో మెరిసిన సాహు ఆలిండియా 21,051 ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో కటక ఎస్సీబీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశానికి అవకాశం దక్కింది. కౌన్సిలింగ్, అడ్మిషన్ తదితర ఖర్చుల కోసం సాహుకు రూ.50 వేల వరకు అవసరం ఏర్పడింది. దీనిపై ఓ వార్తా పత్రికలో కథనం ప్రచురితం కాగా దాతలు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. శనివారం ఐదుగురు దాతలు (వేర్వేరుగా) సుమారు రూ. 55 వేల వరకు ఆర్థిక సాయమందించారు. ఆ తరువాత కూడా పలువురు వ్యక్తులు, సంస్థలు విరాళాలు అందించేందుకు ముందుకు రాగా, ఆయన వాటిని సున్నితంగా తిరస్కరించడం గమనార్హం. సౌమ్యరంజన్‌లోని ఈ నిజాయతీ ఆయనను భవిష్యత్తులో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందని పలువురు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

తన పూరిల్లు వద్ద సాహు

దాతలకు ధన్యవాదాలు

ఈ విషయమై సాహు మాట్లాడుతూ ఓ ఆంగ్ల దిన పత్రికలో తన నేపథ్యం గురించి కథనం ప్రచురించాక చరవాణికి విపరీతంగా ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు. ప్రస్తుతానికి రూ. 50 వేలు సరిపోతాయని, నాలుగున్నరేళ్ల కోర్సు పూర్తి చేసేందుకు మరో రూ. 2 లక్షల వరకు అవసరం ఏర్పడవచ్చన్నారు. ఇప్పటికే అందిన రూ. 55 వేలు సాయం చాలని, భవిష్యత్తులో అవసరమైతే చూద్దామని పేర్కొన్నారు. దాతలందరికీ ధన్యవాదాలని, తన దృష్టంతా ఎంబీబీఎస్ పూర్తిచేసి మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకోవడంపైనే ఉందన్నారు. అతని తల్లి సంజుక్త సాహు స్పందిస్తూ తనకెంతో గర్వంగా ఉందన్నారు. నీట్‌లో ర్యాంకు సాధించడంతోపాటు నిజాయతీగా విరాళాలను తిరస్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

మన నగరాలు, పట్టణాలు అభివృద్ధికి చిరునామా కావాలి

స్థానిక స్వపరిపాలనా దినోత్సవంలో సీఎం మోహన్

ప్రసంగిస్తున్న సీఎం మోహన్. వేదికపై మంత్రి కృష్ణచంద్ర తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మన నగరాలు, పట్టణాలు సమృద్ధికి చిరునామా కావాలని, స్వయం సమృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆకాంక్షించారు. సోమవారం భువనేశ్వర్‌లోని ఓయూఏటీ ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి స్థానిక స్వపరిపాలనా వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం కౌన్సిలర్ల బాధ్యతని, ప్రజలు అవసరాలు తీర్చడానికి చిత్తశుద్ధి కనబరచాలన్నారు. భువనేశ్వర్, కటక, పూరీ, పరదీప్‌లను సంధానించి హైదరాబాద్ తరహాలో గ్రేటర్‌గా చేయాలన్న ధ్యేయంతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన 28 ఎన్‌ఏసీలకు సీఎం రూ.560 కోట్లు ప్రకటించారు. త్వరలో మిగతా ఎన్‌ఏసీలకు రూ.20 కోట్ల చొప్పున అర్బన్ డెవలప్‌మెంట్ కింద కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్ర్, భువనేశ్వర్ మేయరు సులోచనాదాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగార్గ్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉషాపాడి, ఇతర అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. వేదికపై మొక్క నాటిన సీఎం పట్టణాల్లో పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలని సందేశమిచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాల ఆహ్వానితులు

రూ.2.12 కోట్ల గోల్డ్‌లోన్ మోసం

బ్యాంకు మాజీ మేనేజర్ అరెస్టు

సత్యబ్రత బోయి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నకిలీ, న్యాయబద్ధం కాని బంగారు నగలపై రూ. 2.12కోట్ల రుణం మంజూరు చేసి మోసానికి పాల్పడిన మాజీ బ్యాంకు మేనేజర్‌ను ఒడిశా ఆర్థిక నేర నియంత్రణ విభాగం (ఈవోడబ్ల్యూ) అరెస్టు చేసింది. ఈవోడబ్ల్యూ వర్గాల సమాచారం మేరకు జోడాలో ఓ ప్రభుత్వరంగ బ్యాంకు మాజీ మేనేజర్ సత్యబ్రత బోయి ఈ నేరానికి పాల్పడ్డారు. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య నకిలీ నగలపై బోయి రూ. 2.12 కోట్ల మేర 100 గోల్డ్ లోన్లు మంజూరు చేశారు. దీనిపై బాలేశ్వర్ ప్రాంతీయ మేనేజర్ అశుతోష్ సుశీల్‌కుమార్ పట్నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బంగారు రుణాలు మంజూరైన 100ఖాతాల్లో 23 మూతపడ్డాయి. యాక్టివ్‌గా ఉన్న మరో 76 ఖాతాలపై ఈ ఏడాది ఆగస్టు 18 నాటికి రూ. 1.97 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. రుణ గ్రహీతలైన సంబంధిత ఖాతాదారులకు తెలియకుండానే రుణాల నగదు జమ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ నగదు బోయికి సంబంధమున్న, అతని సహచరుల ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆరోపణలున్నాయి.

అందరి గొంతూ ఒక్కటైంది.. జీతం పెంపు కోరుతోంది

సీఎంకి విన్నవిస్తున్న ఎమ్మెల్యేలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే

పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలంతా తమ గొంతు వినిపిస్తున్నారు. సమస్యలు ఏకరవు పెడుతున్నారు. ఇదేదో ప్రజా సమస్యలపై అనుకుంటే పొరపాటు. వారి జీతభత్యాల గురించి అంతా ఒకే తాటిపైకి వచ్చారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్ని పార్టీల సభ్యులు కలిసి తమ ఇబ్బందులు వివరించి జీతాలు పెంచాలని వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. 2017లో శాసనసభ్యుల జీతాలు పెంచారు. గతేడాది పెంచాలని అందరూ కోరిన తర్వాత అన్ని పార్టీల సభ్యులతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఒక సంఘం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో ఎమ్మెల్యేల జీతభత్యాలపై సంఘం అధ్యయనం చేసి నివేదిక సీఎంకు సమర్పించింది. అన్నికోణాల్లో సమీక్షించిన తర్వాత ప్రస్తుతం రూ.లక్షగా ఉన్న జీతం రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీలో ఆమోదింపజేశారు. గవర్నర్ ఆమోదం కోసం పంపారు. జీతాల పెంపు ప్రతిపాదన ప్రజల్లో చర్చనీయాంశమైంది. ప్రసార సాధనాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు విపక్షనేత నవీన్ పట్నాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సేవకులకు ఇంతేసి జీతాలేంటని ప్రశ్నించారు. తన జీతం అనాథలకు కేటాయిస్తానన్నారు. ఇలా అన్నిచోట్లా వ్యతిరేకత వ్యక్తమవడంతో జీతాలు పెరుగుదల బిల్లు వెనక్కి తీసుకొంటున్నట్లు సభా వ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ ఈ ఏడాది ఆరంభంలో అసెంబ్లీలో ప్రకటించారు.

శాసనసభాపతి, మంత్రితో పార్లమెంటు సంయుక్త కమిటీ బృందం

రామచంద్ర కదం

మాజీ సభ్యుల వినతిపత్రం.. ఇటీవల మాజీ ఎమ్మెల్యేలు కొంతమంది సీఎం మోహన్‌మాఝిని కలిశారు. తమకిస్తున్న పించన్లు మందుల బిల్లులకే సరిపోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. భాజపా, బిజద, కాంగ్రెస్ ఎమ్మెల్యేలూ జీతాలు పెంచాలని కోరుతున్నారు. కొందరు మీడియా ముందు తమ ఇబ్బందులు చెప్పుకుంటున్నారు.

ఈ సమావేశాల్లో బిల్లు

ఆదివారం ఎంపీ బీరేంద్రప్రసాద్ బైశ్య అధ్యక్షతన పార్లమెంటు సభ్యుల బృందం భువనేశ్వర్ చేరుకుంది. రాత్రి శాసనసభాపతి సురమాపాఢి, సభా వ్యవహారాల మంత్రి మహాలింగతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి సత్యబ్రత రౌత్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేల జీతాల పెరుగుదల అంశంపై చర్చ జరిగింది. పార్లమెంటు బృందం సానుకూలత తెలిపింది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 22 నుంచి అసెంబ్లీ కొలువుదీరనుండగా ప్రభుత్వం ఎమ్మెల్యేల జీతాల పెరుగుదల బిల్లు మళ్లీ ప్రవేశపెడుతుందని విశ్వసనీయంగా తెలిసింది. ఈసారి శాసనసభ్యులు, మాజీ ఎమ్మెల్యేల జీతాలు, పింఛన్లు ఏమేరకు పెంచుతారన్న దానిపై స్పష్టత రాలేదు.

ఆశాభావంతో ఉన్నాం

కాంగ్రెస్ సభాపక్షం (సీఎల్పీ) నేత రామచంద్ర కదం ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ తమ జీతాలు ఎటూ సరిపోవడం లేదన్నారు. గతసారి పెంచినట్టే పెంచి వెనక్కి తీసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం జరుగుతుందన్న ఆశాభావంతో ఉన్నామన్నారు.

గుడారి ఎన్‌ఏసీకి రూ.2 కోట్ల పురస్కారం

సీఎం మోహన్‌మాఝి, మంత్రి కృష్ణచంద్ర చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న ఎన్‌ఏసీ అధికారులు

రాయగడ పట్టణం, గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి నగర పంచాయతీ(ఎన్‌ఏసీ)కి రూ.2 కోట్ల నగదు పురస్కారం లభించింది. సొంత ఆదాయ వనరుల పరంగా 92 శాతం వృద్ధి రేటు సాధించినందుకు ప్రభుత్వం దీనిని అందజేసింది. రాష్ట్రస్థాయి స్థానిక సంస్థల స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, గృహనిర్మాణ పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కృష్ణచంద్ర మహాపాత్ర్ దీనికి సంబంధించి చెక్కు, పురస్కారాన్ని అందజేశారు. ఎన్‌ఏసీ కార్యనిర్వాహణ అధికారి ప్రసన్నకుమార్ పాఢి పాల్గొని వీటిని అందుకున్నారు. గుడారి ఎన్‌ఏసీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 36.45 లక్షల ఆదాయం సమకూరగా, 2025-26లో రూ.70.20 లక్షలకు పెరిగినట్లు జిల్లా యంత్రాంగం మీడియా ప్రకటనలో వెల్లడించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పౌరసేవల బలోపేతానికి ఈ నిధులను వెచ్చించనున్నారు.

అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో నమోదు కావాలి

అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా పర్యవేక్షకుడు ప్రశాంత కుమార్ రెడ్డి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)-2026 ప్రక్రియలో తప్పులు లేని, స్వచ్ఛమైన నిష్పక్షపాతమైన ఓటరు జాబితాతోపాటు అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అంతా అప్రమత్తంగా ఉండాలని గంజాం జిల్లా ఓటరు జాబితా పర్యవేక్షకుడు, ఇడ్కో మేనేజింగ్ డైరెక్టర్ డి.ప్రశాంత కుమార్ రెడ్డి సూచించారు. ఛత్రపురంలో పాలనాధికారి కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో 'సర్' ప్రక్రియపై సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన రెడ్డి పైవిధంగా మాట్లాడారు. జిల్లాలో 'సర్' ప్రక్రియ పురోగతిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఇదే ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగిందని జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి (డీఐపీఆర్‌వో) సౌరవ్ ప్రధాన్ సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

బోధన వృత్తి... పాముల సంరక్షణ ప్రవృత్తి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: సాధారణంగా పాములు కనిపించగానే భయపడని వారుండరు. దాని కాటు బారిన పడకుండా ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగు తీస్తారు. మహిళల్లో ఈ భయం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. అందుకు భిన్నంగా ఓ యువతి నిర్భయంగా విష సర్పాలను పట్టి సురక్షిత ప్రాంతాల్లో వదులుతున్నారు. ఆమె అనుగుల జిల్లా తాల్చేర్‌కు చెందిన నిహారిక మహాపాత్ర్ (29). బీఎస్సీ చదువుకున్న ఆమె వృత్తిరీత్యా తాల్చేర్‌లోని ప్రభుత్వ పరిశ్రమల శిక్షణా కేంద్రం (ఐటీఐ)లో బోధకురాలిగా పని చేస్తున్నారు. విష సర్పాల్ని కాపాడటమంటే ఆమెకు ఆనందం. స్నేక్ హెల్ప్ లైన్ సభ్యురాలిగా పాముల్ని ఎలా కాపాడాలన్న దానిపై ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులకు ఆమె శిక్షణ కూడా ఇస్తున్నారు. 'మా అమ్మకు పాములంటే భయం లేదు. అదే నాలో ధైర్యాన్ని పెంచింది. ఒడుపుగా పాముల్ని పట్టుకోవడంలో శిక్షణ పొందాను. మూడేళ్లుగా వాటిని కాపాడుతూ సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెడుతున్నాను' అని నిహారిక 'న్యూస్‌టుడే'కు చెప్పారు. విషపూరిత నాగుపాము, కట్ల పాము (కామన్ క్రెయిట్) వంటి వాటిని కూడా పట్టుకుంటున్నానని, పొడ వాటి కొండ చిలువల్ని కాపాడుతున్నానని తెలిపారు. ఇంతవరకూ వందకుపైగా సర్పాలను కాపాడానని చెప్పారు. తన ఆసక్తికి తల్లిదండ్రులు ఏనాడూ అడ్డు చెప్పలేదని వివరించారు. వాటిని పట్టుకోవడమంటే ప్రాణాలతో చెలగాటమేనని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, ప్రాణాలకే ప్రమాదమని తెలిపారు. ఒకప్పుడు ఇవి కనిపించగానే ప్రజలు కొట్టి చంపేసేవారని, అటవీ శాఖ, సర్ప ప్రేమికుల ప్రచారం వల్ల కొన్నేళ్లుగా వాటిని కాపాడేందుకు ప్రజలు తమను లేదా అటవీశాఖ అధికారులను సంప్రదిస్తున్నారన్నారు.

పామును పట్టుకొనే ప్రయత్నంలో నిహారిక

సైకిల్‌పై చార్‌ధామ్ యాత్రకు సిద్ధం

సాధు (తలపాగా ఉన్న వ్యక్తి)ను పంపిస్తున్న స్థానికులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ సమితి మూర్తుమ్మ పంచాయతీ అంబాగుడకు చెందిన సాధుహరిజన్ సోమవారం సైకిల్‌పై చార్‌ధామ్ యాత్ర ప్రారంభించాడు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను సన్మానించి పంపించారు.

రుతపర్ణ, శ్వేత పర్ణలకు పతకాలు

పతకాలు, బహుమతులతో రుతపర్ణ పండా, శ్వేతపర్ణ పండా

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: నైజీరియాలో జరిగిన లాగోస్ ఇంటర్నేషనల్ క్లాసిక్-2026 బ్యాడ్మింటన్ టోర్నీలో ఒడిశా క్రీడాకారిణులు రుతపర్ణ పండా, శ్వేతపర్ణ పండా రాణించారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో మహిళల డబుల్స్ తుదిపోరులో వీరిద్దరూ ఉత్తమ ఆటతో విజేతగా నిలిచి పతకాలు, బహుమతులు అందుకున్నారు. రాష్ట్ర క్రీడా శాఖ ఆయా వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి వారికి అభినందనలు తెలిపింది.

బ్యాడ్మింటన్ సింగిల్స్ టైటిల్ విజేత తన్వి

పతకంతో తన్వి పత్రి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఇండోనేషియాలో జరిగిన పొలిట్రన్ పొంటియనాక్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ఛాలెంజ్-2026 పోటీల్లో ఒడిశా యువ మహిళా షట్లర్ తన్వి పత్రి విజేతగా నిలిచింది. ఆదివారం నిర్వహించిన మహిళా సింగిల్స్ కేటగిరీలో ఆమె టైటిల్ కైవసం చేసుకుంది. రాష్ట్ర క్రీడా శాఖ ఆయా వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి తన్వికి అభినందనలు తెలిపింది.

క్యాన్సర్‌తో ఐపీఎస్ సీనియర్ అధికారి మృతి

షెఫీన్ అహ్మద్

రాయగడ పట్టణం, గుణుపురం, న్యూస్‌టుడే: ఒడిశా కేడర్‌కు చెందిన ఐపీఎస్ సీనియర్ అధికారి క్యాన్సర్‌తో మృతి చెందారు. 2003 బ్యాచ్‌కు చెందిన షెఫీన్ అహ్మద్ 2023 జులై నుంచి ఒడిశా క్రైంబ్రాంచ్, సీఐడీ ఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. కేరళలో జన్మించిన ఆయన కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో గతంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. మళ్లీ వ్యాధి ఇబ్బంది పెట్టడంతో తిరువనంతపురం(కేరళ)లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ సంతాపం తెలిపారు. ఎక్స్ వేదికగా సీఎం మాఝి స్పందిస్తూ రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి షెఫీన్ అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రేపటి వరకు జల్లులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఉత్తర కోస్తా, బెంగాల్ తీరంలో నెలకొన్న తీవ్ర అల్పపీడనం అదేచోట స్థిరంగా కొనసాగుతోందని, దీనికి అనుబంధంగా సముద్ర ఉపరితలానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం స్థిరంగా ఉందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అధికారి బి.కె.త్రిపాఠి సోమవారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పీడనం మంగళవారం నాటికి బెంగాల్‌లోని గాంగ్‌టెక్ ప్రాంతానికి తరలి క్రమేణా బలహీనపడుతుందని తెలిపారు. దీని ప్రభావం బుధవారం(2న) వరకు పశ్చిమ ఒడిశా జిల్లాలపై ఉంటుందన్నారు. మంగళవారం ఉత్తరకోస్తా, పశ్చిమంలో వర్షాలకు అవకాశం ఉన్నందున ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు.

★ **బరగఢ్ జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు..** ఐఎండీ బరగఢ్ జిల్లాకు సోమవారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్తగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది.

గడిచిన 24 గంటల్లో భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల వివరాలు సెంటీమీటర్లలో...

కేంద్రం	వర్షపాతం
బెన్సా (సుందర్‌గఢ్)	16
బార్కోట్ (దేవగఢ్)	12
హతడిహి (కేంఝర్)	12
కనిహ (అనుగుల)	11
తెల్కోయి (కేంఝర్)	10
పలలహడ (అనుగుల)	9
సమకుంఠ (మయూర్‌భంజ్)	9
చందన్‌పూర్ (మయూర్‌భంజ్)	9
బణైగడ (సుందర్‌గఢ్)	8
బాలేశ్వర్	7
భోగరాయి (బాలేశ్వర్)	6
గోప్ (పూరీ)	5
పట్టాముండై (కేంద్రపడ)	5
జట్నీ (ఖోర్ధా)	5
నువాగాం (కొంధమాల్)	5
ఝార్సుగుడ	5

పశ్చిమ, ఉత్తరకోస్తాలోని ఇతర కేంద్రాల్లో 2 నుంచి 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపానికి చెక్

18 జిల్లాల్లో సంపూర్ణ పుష్టి యోజన అమలుకు సర్కారు నిర్ణయం

చిన్నారులకు ఆరోగ్య సంబంధిత కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఇకపై ఆ సమస్య నుంచి విముక్తి కలగనుంది. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలపై సర్కారు దృష్టి సారించనుంది. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని పారదోలేందుకు కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా 18 జిల్లాల్లో సంపూర్ణ పుష్టి యోజన అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన కార్యదర్శి అనూగార్గ్ అధ్యక్షతన జరిగిన అత్యున్నత సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఆ వివరాల ప్రకారం...18 జిల్లాల్లోని 23,088 అంగన్‌వాడీ కేంద్రాలను ఈ పథకంలో చేర్చనున్నారు. రెండేళ్ల కాలపరిమితితో 2026-27 నుంచి 2027-28 వరకు అమలు చేయనున్న ఈ పథకం కోసం రూ. 360.68 కోట్లను సమకూర్చనున్నారు. పౌష్టికాహారం, అవగాహన సదస్సులు, పర్యవేక్షణ, ఆహార నాణ్యత పరీక్షలు తదితర వాటి కోసం నిధులను వెచ్చించనున్నారు.

18 జిల్లాలివే..

ఈ పథకం కోసం రాయగడ, కొరాపుట్, మల్కాన్‌గిరి, నవరంగపూర్, అనుగుల, దేవగఢ్, ఢెంకనాల్, గజపతి, గంజాం, జాజ్‌పూర్, ఝార్సుగుడ, కలహండి, నువాపడ, మయూర్‌భంజ్, సంబల్‌పూర్, సుందర్‌గఢ్, కేంఝర్, కొంధమాల్ జిల్లాలు ఎంపికయ్యాయి. సమృద్ధ అంగన్‌వాడీ యోజన కింద రాష్ట్రంలో కొత్త అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి సర్కారు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా అసంపూర్తిగా ఉన్న కేంద్రాల నిర్మాణం పూర్తిచేయడం, ఇదివరకున్న కేంద్రాల్లో వసతుల మెరుగు తదితర అంశాలపై దృష్టిసారించనున్నట్లు వెల్లడించాయి.

ఇంటికి చేరుకున్న కుల్సుమ్

కుల్సుమ్ నిగార్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మయూర్‌భంజ్ జిల్లా కేంద్రం బరిపదకు చెందిన అమ్మాయి కుల్సుమ్ నిగార్ సోమవారం సురక్షితంగా ఇంటికి చేరుకుంది. నేపాల్‌కు ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఆమె ఆగస్టు 26న వరదల్లో చిక్కుకుంది. ఆమె ఆచూకీ తెలియలేదు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు విదేశాంగ శాఖ యంత్రాంగం కుల్సుమ్ వివరాలు తెలుసుకుని పునరావాస కేంద్రానికి తెచ్చి ఆ తర్వాత బరిపదకు పంపించే ఏర్పాట్లు చేసింది. ఇంటికి చేరుకున్న ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జగన్నాథుని కృప, తల్లిదండ్రుల ఆశీస్సులతో ఇంటికి చేరుకున్నట్లు తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేసింది.

(c) eenadu

వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు పూయిద్దాం

వృద్ధురాలికి ఆహారం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యుడు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి బి.సీతాపురం వద్ద వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు సాయిక్షప ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సరస్వతి మహాపాత్ర్, అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మహాపాత్ర్, ఉపాధ్యక్షురాలు రష్మిత మహాపాత్ర్ పాల్గొని వృద్ధులకు భోజనాన్ని పంపిణీ చేశారు. వృద్ధులతో కొంత సమయం గడిపి, వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ట్రస్ట్ సభ్యులు అన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయక్. చిత్రంలో శరవణ వివేక్, సమీర్ జెనా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపహండిలో సమితి కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగిన ఇందులో 66 వ్యక్తిగత ఫిర్యాదులు, వివిధ సమస్యలపై 48 సామూహిక ఫిర్యాదులు అందాయి. బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం., గంజాం అదనపు పాలనాధికారి సచ్చిదానంద నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య అభివృద్ధి అధికారి సమీర్ కుమార్ జెనా పాల్గొన్నారు. అక్కడికక్కడ రెండు సమస్యల్ని పరిష్కరించిన అధికారులు ఏడుగురికి రెడ్‌క్రాస్ నిధి నుంచి మొత్తం రూ.40 వేల ఆర్థిక సహకారాన్ని అందజేశారు.

బియ్యం ఏటీఎం ప్రారంభం

విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణచంద్ర పాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఢెంకనాల్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన బియ్యం ఏటీఎంను ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇదివరకు భువనేశ్వర్, ఝార్సుగుడల్లో బియ్యం ఏటీఎంలు ప్రారంభమయ్యాయని, ఢెంకనాల్‌లో మూడోదని చెప్పారు. త్వరలో అన్ని జిల్లాల్లో వీటిని ప్రారంభిస్తామని, రేషన్‌కార్డు నెంబర్లు, వేలిముద్ర (థంబ్) వేసి రేషన్ సామగ్రి పొందొచ్చన్నారు. దుకాణాల వద్ద వేచి చూసే పరిస్థితి ఉండదని, 40 కిలోల బియ్యం ఒకసారి ఏటీఎం ద్వారా తీసుకోగలుగుతారని చెప్పారు.

రాకపోకలకు పాట్లు...రహదారిపై వరినాట్లు

బురద రహదారిపై వరినాట్లు వేస్తున్న గ్రామస్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఝోరిగాం సమితి బిషి పంచాయతీ దుమురిపాదర నుంచి రెండు కిలోమీటర్ల వరకు బురద రహదారి కావడంతో రహదారి నిర్మించాలని పదే పదే గ్రామస్థులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో సోమవారం ఏడు గ్రామాల ప్రజలు రహదారిపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. పండర గంది, మనగుడ, చోటగుడ, కదాభట్టా, లంబిబెడా, పరసలా, రతఖండిగుడ గ్రామాలకు సరైన రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మజ్జిగౌరి అమ్మవారి హుండీ లెక్కింపు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఉత్కళాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన మజ్జిగౌరి అమ్మవారి హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. మందిరం ట్రస్ట్ అధ్యక్షుడు రాయిసింగ్ బిడిక ఆధ్వర్యంలో నిర్వహించిన లెక్కింపులో 100 మందికి పైగా స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు నగదు, బంగారం, వెండి తదితర వివరాలను లెక్కించారు. ఉదయం 10 గంటలకు మేజిస్ట్రేట్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీసుల సమక్షంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య 9 హుండీలను తెరిచారు. లెక్కింపులో రూ. 54,15,902 నగదు, 64 గ్రాముల బంగారం, 1.764 కిలోల వెండి లభించినట్లు రాయిసింగ్ తెలిపారు. అనంతరం విరాళాల లెక్కింపునకు బ్యాంకు సిబ్బంది తదితరులు సహకరించారు. రెండు నెలల కిందట జూన్ 29న జరిపిన హుండీ లెక్కింపులో రూ. 1.22కోట్ల నగదు, 32 గ్రాముల బంగారం, 1.300 కిలోల వెండి లభించిన విషయం తెలిసిందే. ఈ సారి లెక్కింపు సందర్భంగా పలు విదేశీ కరెన్సీ నోట్లను సిబ్బంది గుర్తించారు.

ఎమ్మేసీజీలో సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

ఎమ్మేసీజీలో ధర్నా చేస్తున్న మంచ్, ఇతర సంస్థల ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దక్షిణ ఒడిశా జిల్లాల వాసులకు ఆరోగ్య సేవలు అందిస్తున్న బ్రహ్మపురలోని ఎమ్మేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ స్థానిక మానవ అధికార్ సురక్షా మంచ్ సోమవారం ఆందోళనకు దిగింది. మంచ్, ఇతర సంస్థల ప్రతినిధులు ఆసుపత్రి సూపరింటెండెంటు కార్యాలయం ఆవరణలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఎమ్మేసీజీలో బర్న్ కేర్ యూనిట్ సేవలు ప్రారంభించాలని, కొత్త ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని, ట్రామా కేర్ కేంద్రంలో డిజిటల్ ఎక్స్‌రే అమర్చాలి తదితర డిమాండ్లు చేశారు. ఆసుపత్రి ఆవరణలో జన ఔషధ కేంద్రాన్ని తెరవాలని, బయట, లోపలి రోగుల వార్డుల్లో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదుల సౌకర్యాలు పెంచాలని కోరారు. ఆయా డిమాండ్లతో ముఖ్యమంత్రి పేరిట ఓ వినతిపత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంటు ఆచార్యిణి సుదీప దాస్‌కు అందజేశారు. ఈ ధర్నాలో మంచ్‌తోపాటు వివిధ రాజకీయ పార్టీలు, సంస్థల ప్రతినిధులు అబనీ గయా, ఆర్. సత్యనారాయణరావు, గుణనిధి బెహర, బిజయ కుమార్ పాఢి, పి.పార్వతి, ఆదిత్యనారాయణ రథ్, ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.

సంబల్‌పూర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు చేయండి

బరగఢ్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌పై స్థానిక ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా మౌనంగా ఉండటంపై పశ్చిమాంచల్ యూత్ యాక్షన్ కమిటీ ప్రశ్నలు సంధించింది. మద్దతు ఉంటే ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటో వెల్లడించాలని కోరింది. ఎమ్మెల్యే నుంచి స్పష్టమైన సమాధానం కావాలని పేర్కొంది.

ఓసీసీ నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా పందర సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సిమిలిగుడ ఓసీసీ నగర్‌లో మొక్కలు నాటారు. జిల్లా అధ్యక్షుడు జయబాదిత్య నేతృత్వంలో కార్యదర్శి అమర్, సభ్యులంతా పాల్గొని ఓసీసీ నగర్ పరిసర ప్రాంతాల్లో అనేక రకాల మొక్కలు నాటారు.

బాధితులకు ఎంపీ చేయూత

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా చందహండి సమితిలో సోమవారం ఎంపీ బలభద్ర మాఝి పర్యటించారు. సమితిలో పట్కాలియా, చిలిగావ్, బందకనా, దోలబెడా, దడిపాని తదితర పంచాయతీల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించి, వారికి ఆర్థిక సహాయం, అవసరమైన సామగ్రి అందజేశారు.

మొబైల్ రీఛార్జ్‌కి డబ్బులివ్వలేదని బాలుడి ఆత్మహత్య

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: మొబైల్ రీఛార్జ్ చేసుకునేందుకు ఇంట్లో వాళ్లు డబ్బులివ్వలేదని 14 ఏళ్ల బాలుడు మృతిచెందిన ఘటన బొలంగీర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంటాబంజి స్టేషన్ పరిధి కులియాదర గ్రామానికి చెందిన 14 ఏళ్లబాలుడు చరవాణి రీఛార్జ్ కోసం రూ.300 అడిగాడు. దీంతో బాలుడికి, కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిన బాలుడు ఓ చోట అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో బాధిత బాలుడ్ని కంటాబంజి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అసహజ మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

ట్రాక్టరు ఢీకొని దివ్యాంగుడి దుర్మరణం

రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: ఓ దివ్యాంగుడు కోళ్లను అమ్మేందుకు వెళ్తుండగా ట్రాక్టరు ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దివ్యాంగుడు కొలంపూర్ నుంచి మినాపూర్‌కు ఇందన్ మహ్మద్(30) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాయగడ సరిహద్దు కలహండి జిల్లా కొలంపూర్ పోలీసుస్టేషన్ మినాపూర్ రోడ్డులో ఎదురుగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్రగాయాలవడంతో స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహ్మద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

టైర్లు కాల్చి రాస్తారోకో

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జరడా పోలీసు స్టేషన్ పరిధిలోని కెళువా సమీపాన నారాయణపూర్ గ్రామంలో ఆదివారం ఇంటి సమీపం నుంచి వెళుతున్న 11 కేవీ విద్యుత్తు తీగలను ప్రమాదవశాత్తూ తాకి చందన్ ప్రధాన్ (16) అనే పదో తరగతి విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆయనను పాత్రపురం ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్థులు కెళువా కూడలిలో రాత్రి టైర్లు కాల్చి రాస్తారోకో చేపట్టారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, ఇళ్లకు సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్తు తీగలు తొలగించాలని డిమాండు చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

మల్దాలో మొసలి కలకలం

జయపురం, న్యూస్‌టుడే: జయపురంలోని జయంతిగిరి పంచాయతీ మల్దా గ్రామ సమీపంలో ఉన్న బడపడా కాలువలో సోమవారం మొసలి కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానికులు అటవీ శాఖకు సమాచారం ఇవ్వగా, తనిఖీలు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: దశమంత్‌పూర్ సమితికి చెందిన కలటిగుడలో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత సోమవారం సందర్శించారు. ఆయా గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూడిళ్లు ధ్వంసమయ్యాయి. సీసీ రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎమ్మెల్యే పవిత్ర పార్టీ నేతలు, కార్యకర్తలతో గ్రామాన్ని సందర్శించి నష్టాన్ని చవి చూసిన బాధితులను కలిసి పరామర్శించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వం సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్యం దిగజారడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ వెంటనే అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గ్రామంలో సందర్శించిన ఎమ్మెల్యే పవిత్ర, రూపక్ తదితరులు

విద్యార్థి మృతి ఘటనలో వంట మనుషుల సస్పెన్షన్

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి గుముడా పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గురునాథ్ ముదులి హత్యకు సంబంధించి రెండు రోజుల కిందట ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్ సస్పెండైన విషయం తెలిసిందే. సోమవారం వంట మనుషులు వంశీధర్ షడంగి, పి. శంకర్‌ను సస్పెండ్ చేశారు. వసతి గృహంలో 248 మంది ఉండగా, 118 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ నుంచి తమ ఇళ్లకు తీసుకెళ్లిపోయారు.

సస్పెండైన వంట మనుషులు

అనంతరం ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్ సస్మాల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ ఆదేశించారు.

వంతెన నిర్మించండి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ పాతకోళీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. కసాయి గ్రామీణ ప్రాంతం నుంచి గోకుల్‌పూర్(గ్రామీణ) ప్రాంతం మీదుగా మిడ్నాపూర్ లా కాలేజ్ వరకు పైవంతెన నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

విజిలెన్స్ వలలో డీఎల్‌వో

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లా కార్మికశాఖ అధికారి (డీఎల్‌వో) ఆకాశ్ బిశోయి విజిలెన్స్‌కు చిక్కారు. ఒక ఎలక్ట్రికల్ కాంట్రాక్టరుకు లేబర్ లైసెన్స్ కేటాయించడానికి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఆదివారం రాత్రి పట్టుబడ్డారు. బిశోయిపై ఇతర అభియోగాలున్నాయి. విజిలెన్స్ అధికారులు అతని ప్రభుత్వ వసతి గృహంలో సోదాలు చేసి రూ.7,29,200లు నగదు, 300 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో ఆదివారం సీఎం సువేందు అధికారి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఘటాల్‌లో భాజపా శిక్షణా శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతలకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయని, డాక్టర్లు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సువేందు అధికారి

మద్యం నిల్వలపై పోలీసుల దాడులు

పట్టుబడిన మద్యం

రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: కొత్త బస్టాండు సమీపంలో అక్రమ మద్యం నిల్వలపై రాయగడ జిల్లా బిసంకటక్ పోలీసులు దాడులు చేశారు. ఈ సోదాల్లో పది మద్యం బాక్సులు పట్టుబడ్డాయి. ఎస్డీపీవో సంతోషిని ఓరం తెలిపిన వివరాల ప్రకారం. ..రాయగడ నుంచి ఓ ప్రైవేటు బస్సులో విదేశీ మద్యం కొత్త బస్టాండుకు తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు అధికారులు దాడులు జరిపారు. 10 పెట్టెల్లో 190 మద్యం సీసాలతో పాటు 83 లీటర్ల బీరు పట్టుబడింది. వీటి విలువ దాదాపు రూ. 2 లక్షలు ఉన్నట్లు తెలిపారు. దర్యాప్తు మొదలుపెట్టి నిందితులను అదుపులోకి తీసుకుంటామన్నారు.

ఇద్దరి అరెస్టు....

బరగఢ్, న్యూస్‌టుడే: అత్తాబిరా ఖరముండా ప్రాంతంలో సోమవారం అత్తాబిరా పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 25 లీటర్ల విదేశీ మద్యం, ఓ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రవి కుమార్ పాఠక్(ఝార్ఖండ్), భాస్కర్ కుమార్ (బిహార్)ను అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రైలులో ల్యాప్‌టాప్ చోరీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాణి శిరోమణి రైల్లో ల్యాప్‌టాప్ దొంగతనం కేసును తూర్పు మిడ్నాపూర్ జిల్లా పంచుకురా జీఆర్పీ పోలీసులు ఛేదించారు. నిందితుడ్ని అరెస్టు చేసి, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రయాణికురాలు సత్యార్థిపాండే ల్యాప్‌టాప్ బ్యాగు చోరీకి గురైంది. సమాచారం అందుకొన్న పోలీసులు తనిఖీలు చేపట్టి హరుపాల్ అనే నిందితుడ్ని అరెస్టు చేశారు.

ఆరు చరవాణులు స్వాధీనం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ రైల్వే పోలీసులు ఖరగ్‌పూర్ డివిజన్‌లో గల వేర్వేరు రైల్వేస్టేషన్లలో 6 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని దొంగలించిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ప్రకటించారు.

61 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పార్కింగ్ చేసిన కారులో ఉన్న గంజాయిని ఝార్సుగుడ పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఝార్సుగుడ ఎస్పీ జి.ఆర్.రాఘవేంద్ర మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం చితువాపొడ కూడలి సమీపంలో పార్కింగ్ చేసిన ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా 61. 280 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి సుఖువా గోదాం ప్రాంతం పురునాబస్తీకి చెందిన కుందన్ సాహు(35)ను అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

ఎంఎండీఆర్‌పై ఉద్యమిస్తాం

సంజయ్‌దాస్ వర్మ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎంఎండీఆర్ బిల్లు వెనక్కి తీసుకునే వరకు బిజద ఉద్యమిస్తుందని, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీస్తూ, కేంద్రానికి లాభించేలా ఉన్న ఈ చట్టం వల్ల ఒడిశాకు తీరని నష్టమని పార్టీ ఉపాధ్యక్షుడు సంజయ్ దాస్ వర్మ చెప్పారు. సోమవారం భువనేశ్వర్‌లోని శంఖభవన్ (బిజద కార్యాలయం)లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లోక్‌భవన్ వద్ద దీనిపై ధర్నా చేస్తామని, ఆ తర్వాత రాష్ట్ర బంద్ చేపడతామన్నారు.

పోలీసుల విజయోత్సవాలు

విజయ చిహ్నాలు చూపుతున్న విజేతలు, వారి మద్దతుదారులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లా హవల్దారు, కానిస్టేబుల్ సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బ్రహ్మపుర ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రాత్రి ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన వారు మద్దతుదారులతో కలిసి విజయోత్సవాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షునిగా ప్రశాంత కుమార్ మహార్థా విజయం సాధించారు. ఉపాధ్యక్షునిగా మనోజ్ కుమార్ పాఢి, కార్యదర్శిగా కె.శ్రీనివాస్ పాత్ర్, సహాయ కార్యదర్శి-1గా రాజేంద్ర కుమార్ సెఠి, సహాయ కార్యదర్శి-2గా చందన బెహర, కోశాధికారిగా టుంగురు మాళ బిశోయి గెలుపొందారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా హర మహంకుడొ, తారిణి మండల్, హేమచంద్ర బెహర, శరత్ చంద్ర ప్రధాన్, సుచిత్రారాణీ సేనాపతిలు విజయం సాధించారు. విజేతలకు వారి మద్దతుదారులు పూలమాలలు వేసి అభినందించారు.

ఈఎస్ఐ సేవలపై రోగుల అసంతృప్తి

జేకే ఈఎస్ఐ ఆసుపత్రి

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జేకేపూర్‌లోని ఉద్యోగుల రాష్ట్ర బీమ(ఈఎస్ఐ) ఆసుపత్రి సేవలపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడకు వచ్చిన రోగులకు సకాలంలో సేవలు అందడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు కంపెనీకి చెందిన కార్మికులు, ఉద్యోగులు రెండొందల మందికి పైగా ఇక్కడకు చికిత్స కోసం వస్తుంటారు. వారికి చికిత్స అందించడంలో, రక్త, యూరిన్ పరీక్షలు చేయించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని కార్మిక నాయకుడు ఇంఫా, జేకే పరిశ్రమ ఉద్యోగ సంఘాల సలహాదారుడు న్యాయవాది హరిచందన్ ఆరోపిస్తున్నారు. చిన్న రోగానికి కూడా వైద్యం లభించడం లేదని జిల్లా ఆసుపత్రి రాయగడకు తరలిస్తున్నారని చందన్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో మెరుగైన చికిత్స కోసం వస్తే మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జేకే కంపెనీకి చెందిన ఉద్యోగి కుమార్తె విజయలక్ష్మీ చికిత్స కోసం వస్తే ఆమెకు సంబంధించి రక్త నమూనాలు సేకరించడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని సకాలంలో రక్త నమూనాలు తీసుకోలేదని బాధితులు ఆరోపించారు. వెంటనే సమస్యలు తీర్చాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని చందన్ కోరారు.

చెట్టు పడి రాకపోకలకు అంతరాయం

చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి బల్దా పంచాయతీకి చెందిన మాలిభీమ్‌డోల్‌లో సోమవారం ఉదయం ఓ చెట్టుపడి రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి చెట్టు రహదారికి అడ్డంగా నేలకొరిగింది. దీంతో నిర్మాణంలో ఉన్న భవనం కూడా ధ్వంసమై, రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న నందపూర్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చెట్టును తొలగించారు.

EENADU Classifieds

JOBS

Marketing leaders for Servo Tech Solar Energy Company, Salary will be depend work we will Take Best Marketing persons by Phone interview
✆8367228559, 9701288230

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈనాడు పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించే సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక కాళు పాత్ర్ వీధిలోని ఓంశ్రీ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. లంజియా సమితి సభ్యుడు, అంబగడ సేవా సహకార సమితి అధ్యక్షుడు కన్హు చరణ పాత్ర్ జన్మదినం సందర్భంగా ఇది ఏర్పాటైంది. ఎమ్మేసీజీ రక్తనిధి సిబ్బంది 40కుపైగా యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న దాత. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

సొరంగం తవ్వకం పూర్తి

బరగఢ్, న్యూస్‌టుడే: ఖోర్ధా-బొలంగీర్ రైల్వే ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. బౌద్ధ్ జిల్లాలో నిర్మిస్తున్న నంబర్-4 రైల్వే సొరంగం పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. దీంతో భువనేశ్వర్ నుంచి నేరుగా బొలంగీర్‌కు రైలు ప్రయాణం సులభమవుతుందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే సొరంగం పనులు పూర్తయిన దృశ్యం

ఘనంగా స్థానిక స్వపరిపాలనా దినోత్సవం

జయపురం: బిజూపట్నాయక్ విగ్రహం వద్ద పురపాలక అధికారులు

బ్రహ్మపుర: ఎంపీ పాణిగ్రహికి జ్ఞాపిక అందజేస్తున్న మేయరు దొళాయి. చిత్రంలో ప్రముఖులు

బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) ఆధ్వర్యంలో 159వ స్థానిక స్వపరిపాలన దినోత్సవాలు (ఎల్ఎస్‌జీ) ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీఈఎంసీ కొత్త కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన వేడుకల్లో బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రహి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. – న్యూస్‌టుడే, బృందం

కాశీనగర్: సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు మేడిబోయిన సుధారాణి, ఆసీనులైన ఎమ్మెల్యే రూపేష్, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు తదితరులు

గోపాల్‌పూర్ తీరానికి మహర్దశ

సేవా కార్యకర్తలను సన్మానిస్తున్న మంత్రి బిభూతి, కౌన్సిల్ ప్రతినిధులు, అధికారులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ తీరంలో పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులు నిర్మాణమవుతాయి. అత్యాధునిక హంగులు కల్పిస్తారు. సోమవారం గోపాల్‌పూర్ ఎన్ఏసీ కార్యాలయంలో స్థానిక స్వపరిపాలన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాణిజ్య, రవాణా, ఉక్కుగనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్‌జెనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తీర పట్టణం ప్రముఖ పర్యాటక కేంద్రం కాగా ఇప్పుడు పారిశ్రామికవాడగా అవతరిస్తోందని యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మూతపడిన బాలికోన్నత పాఠశాల తెరిపిస్తామని, స్మార్ట్ పార్కు, మత్స్యకారుల ప్రయోజనార్థం ఫిషింగ్ జెట్టీ నిర్మాణాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో బ్రహ్మపుర సబ్‌కలెక్టర్ అవినాష్‌కుమార్, గోపాల్‌పూర్ ఎన్ఏసీ అధ్యక్షుడు ఎ.జానకిరాం, కౌన్సిలర్లు, అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కార్యకర్తలకు, పారిశుద్ధ్య కార్మికులు, ఎన్ఏసీ సిబ్బందికి మంత్రి బహుమతులందజేశారు. కొత్తగా నిర్మాణమైన వెండింగ్‌జోన్ ప్రారంభించిన బిభూతి రూ.15 కోట్ల వ్యయంతో హిల్‌టాప్ ఆవరణలో నిర్మాణం కానున్న హనుమాన్ వాటికా పనులకు శంకుస్థాపన చేశారు.

మాకు న్యాయం చేయండి

ఆందోళన చేస్తున్న రైతులు

బరగఢ్, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయాల వ్యవస్థలో ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పశ్చిమ ఒడిశా రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. బరగఢ్ జిల్లా సమన్వయ సమితి అధ్యక్షుడు లింగరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో రైతులు పాల్గొని న్యాయం చేయాలంటూ డిమాండు చేశారు.

(c) eenadu

శిథిలమైన పైకప్పు.. తప్పదు ముప్పు

బూర్జపాడు, నెలవంక కూడలి మలుపు వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువ పైకప్పు శిథిలావస్థకు చేరింది. నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో చిన్నారులు, పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నిత్య వెలుగులు.. అధిక బిల్లులు

కేశుపురం సమీపంలో విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. పంచాయతీకి అధిక బిల్లులు రావడంతో పాటు చాలా రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో వేగంగా పాడయ్యే అవకాశం ఉందని స్థానికులు మండి పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ గోవిందరావును వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చెరువు కాదు.. రోడ్డే

ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు డొంకూరు ప్రధాన రహదారి చెరువులా మారింది. దీంతో స్థానికులు, సముద్ర తీరానికి వెళ్లే వారు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కాలువ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అడుగు తడబడితే ఆసుపత్రికే

డబ్బూరివీధి కూడలిలో కల్వర్టు చివర భాగాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. అది ప్రమాదకరంగా మారింది. దీనికి ఒకవైపు బడి, మరో వైపు గుడి ఉన్నాయి. నిత్యం జనం రాకపోకలు సాగిస్తుంటారు. వాహనం అదుపు తప్పినా, అడుగులు తడబడినా మురుగు కాలువలో పడిపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏఈ కిశోర్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మర్రి చెట్టు పడింది.. నీరు ఆగింది

కవిటి మండలం బైరిపురం సమీపంలో ఉద్దానం ప్రాజెక్టు ద్వారా పలు గ్రామాలకు నీరందించే ట్యాంకుపై మర్రి చెట్టు పడింది. పైపులు పాడవ్వడంతో కొన్ని గ్రామాలకు నీరు అందడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉద్దానం ఏఈ ఆర్.చైతన్య కుమార్‌ను వివరణ కోరగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని, అన్ని గ్రామాలకు నీరు అందిస్తున్నామన్నారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఝులనా యాత్రలో అలరించిన నృత్యాలు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని 28 నుంచి ప్రారంభమైన ఝులనాయాత్ర నేత్రపర్వం చేస్తోంది. వేడుకలు పూరీలోని ఎమార్, రాధావల్లభ, బొడొ ఒడియా, రాఘవదాస్ మఠాల్లోనూ జరుగుతున్నాయి. సోమవారం తృతీయ తిథిని పురస్కరించుకుని శ్రీక్షేత్రంలోని ముక్తి మండపం, మఠాల్లో సాంస్కృతిక వేడుకలు జరిగాయి. ప్రముఖ ఒడిస్సీ నృత్య గురువు చిత్తరంజన్ సహనీ పురుషోత్తముని కీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు ప్రదర్శించారు.

స్వామి సన్నిధిలో గురు చిత్తరంజన్ సహనీ నృత్యం

బిక్రం పండాకు బెయిల్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే **బిక్రం పండా**కు హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం (1వ) ఆయన విడుదలయ్యే అవకాశం ఉంది. 2025 అక్టోబరు 6న బ్రహ్మపురకు చెందిన న్యాయవాది పీతాబస పండా హత్యకు గురయ్యారు. ఈ కేసులో బిక్రం అరెస్టయ్యారు. తర్వాత బ్రహ్మపుర జిల్లా జడ్జి కోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ పెట్టుకోగా న్యాయస్థానం తిరస్కరించింది. అనంతరం హైకోర్టు తలుపుతట్టారు. ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది.

మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపిన విష్ణుదేవ్: భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహానది జల వివాదం పరిష్కారానికి ఒడిశా ప్రభుత్వం చిత్తశుద్ధితో అన్ని వివరాలు ట్రైబ్యునల్‌కు సమర్పించినందుకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝికి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య మహానది పీట ముడి వీడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

ఇచ్ఛాపురం రైలు నిలయంలో లిఫ్ట్ సౌకర్యం

ఇచ్ఛాపురం రైలు నిలయంలో అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఒకటి, రెండు ప్లాట్‌ఫాంలపై లిఫ్ట్ పెడుతున్నారు. స్టేషన్‌కు దక్షిణం వైపు ఒక పాదచార వంతెన ఉండగా, ఉత్తరం వైపు కొత్తగా మరొకటి నిర్మించారు. దీనికి అనుసంధానంగా లిఫ్టులు అమర్చుతున్నారు. దీనికి పూర్తిగా అనుసంధానంగా ఇరువైపులా స్తంభాల అమరిక పనులు జరుగుతున్నాయి. కొత్త వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించారు. పాత వంతెనకు అనుసంధానంగా నాలుగో నంబరు ప్లాట్‌ఫాంకు కొత్త వంతెన పనులు కూడా పూర్తయ్యాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెండాళం అశోక్ కృషి ఫలితంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కొత్తింట్లో గృహప్రవేశం.. అంతలోనే సజీవదహనం

లారీని ఢీకొన్న ఘటనలో కారులో యువకుడి సజీవ దహనం

విశాఖపట్నం(ఆనందపురం), న్యూస్‌టుడే: సొంతింటి కలను నెరవేర్చుకున్న ఓ సాఫ్ట్‌వేర్ యువకుడు.. గృహప్రవేశం అయిన తర్వాత ఆ ఆనందాన్ని స్నేహితులతో పంచుకోవడానికి వెళ్తూ కారు ప్రమాదంలో సజీవ దహనమైన హృదయ విదారక సంఘటన విశాఖనగర పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆనందపురం సీఐ యర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని రాయగడ జిల్లా గుణుపూర్‌కు చెందిన పోలాకి మోహనరావు పాత్రో, ప్రశాంతి పాత్రోల కుమారుడు అమర్నాథ్ పాత్రో(28) హైదరాబాద్‌లో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సుమారు మూడు నెలల క్రితం ఆనందపురం-విశాఖపట్నం రోడ్డులోని పరదేశిపాలెంలో ఫ్లాట్ కొనుగోలు చేశాడు. ఆగస్టు 27న కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం చేసి కొత్త ఇంటికి మకాం మార్చారు.

ఆనందపురం-పెందుర్తి సర్వీసు రోడ్డులో దగ్ధమవుతున్న కారు

ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టి..: కొత్త ఇల్లు కొనుక్కోవాలన్న తన కోరిక నెరవేరడంతో ఆదివారం రాత్రి స్నేహితులను కలిసి వస్తానని తన కారులో బయలుదేరిన అమర్నాథ్ పాత్రో ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తూ గండిగుండం పరిధిలోని సత్తరువు కూడలిలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో కారు ఇంజిన్ భాగంలో మంటలు చెలరేగి క్షణాల్లో వాహనం అంతా వ్యాపించి అమర్నాథ్ కారులోనే సజీవ దహనమయ్యాడు.

పోలాకి అమర్నాథ్ పాత్రో(28)

అమ్మతో త్వరగా వచ్చేస్తానని చెప్పి..: స్నేహితులను కలిసి వస్తానన్న తన కుమారుడు రాత్రి 12 గంటలైనా ఇంటికి రాకపోవడంతో తల్లి ప్రశాంతి ఫోన్ చేసింది. దారిలోనే ఉన్నానని, త్వరగా వచ్చేస్తానని తల్లికి చెప్పిన అమర్నాథ్ అంతలోనే ప్రమాదానికి గురయ్యాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు మళ్లీ ఆమె తన కుమారుడికి కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఉదయం పోలీసుల నుంచి కాల్ రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించి, సొంత ఇల్లు, కారు కొనుక్కోవాలన్నది తన లక్ష్యమని చిన్ననాటి నుంచే చెప్పేవాడని, వాటిని నెరవేర్చుకొని సుఖంగా జీవించే సమయంలో కుమారుడు దూరమయ్యాడని తల్లిదండ్రులు, మృతుని సోదరి విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది.

సామాజిక అంశాలే రచయితలకు అస్త్రాలు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: రచయితలు సామాజిక అంశాలనే అస్త్రాలుగా సంధించాలని వక్తలు సూచించారు. హరిపురంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో డీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పేడాడ కృష్ణారావు రచించిన 'ఈ అడుగులు ఏ ప్రస్థానానికి..?' పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ పుస్తకంలో ప్రతి వ్యాసం నేటి విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడుతుందన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలకు ఈ పుస్తకం ప్రతిబింబం లాంటిదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.దానేసు అన్నారు. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఐక్య ఉద్యమాలు అనివార్యమని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య పిలుపునిచ్చారు. యు.సోమనాథం, ఎం.కోదండరావు, ఎం.మాధవరావు, పి.దుర్యోధన, ఎస్.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఈ అడుగులు ఏ ప్రస్థానానికి..?' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కోటిపాంలో కరిరాజులు

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలం కోటిపాం పరిసర ప్రాంతాల్లో కరిరాజులు సంచరిస్తున్నాయి. వరి దుబ్బుకడుతున్న సమయంలో అడవి ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు లేక పంటలు పండడంలేదని.. దీనికితోడు గజరాజులు పంటలను నాశనం చేస్తున్నాయని రైతన్నలు విలపిస్తున్నారు. వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

అధ్వాన దారులు.. ప్రమాదకర మలుపులు

పూర్ణాటకం నుంచి ఈదుపురం వెళ్లే రోడ్డులో పరిస్థితి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ మార్గాల్లో కొన్ని చోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వేగ నియంత్రికలు, సూచిక బోర్డులు లేకపోవడం కూడా వాహనదారులకు శాపంగా మారుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనల్లో పలువురు మృత్యువాత పడుతుండగా.. చాలా మంది గాయాల బారిన పడి అవయవాలను కోల్పోతున్నారు.

ఎక్కడెక్కడ: ఇచ్ఛాపురం మండలం బలరాంపురం, పూర్ణాటకం, బూర్జపాడు, బాలకృష్ణాపురం, కేశుపురం, జగన్నాథపురం, కవిటి మండలం ముత్యాలపేట, కవిటి రోడ్డు, రాజపురం, బైరిపురం, కంచిలి మండలం కత్తివరం, మకరాంపురం, రేఖాదేవిపురం నుంచి ముండ్ల గ్రామానికి వెళ్లే రహదారి, సోంపేట మండలం కుత్తుమ రోడ్డు, ఇసకలపాలెం, రుషికుద్ద తదితర ప్రాంతాల కూడళ్ల వద్ద భారీ మలుపులున్నాయి.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రతి రహదారీ మలుపులతో కూడుకున్నదే. అక్కడ రోడ్డు బాగోకపోవడం, ఇరువైపులా పనికిరాని మొక్కలు, పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆయా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి.

- మూడేళ్ల కిందట జగన్నాథపురం వద్ద మలుపులో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు.
- నాలుగేళ్ల కిందట ఇన్నేసుపేట సమీపంలోని మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు.

కేశుపురం సమీపంలో మలుపు వద్ద రహదారి దుస్థితి

చర్యలు తీసుకుంటాం: మలుపుల వద్ద వేగ నియంత్రణలతోపాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. పనికిరాని మొక్కలు తొలగిస్తాం. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - **ధనంజయరావు, జేఈ, పంచాయతీ రాజ్ శాఖ**

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

మన్యం మెరికలు.. క్రీడల్లో మెరిశారు

కస్తూరి | దివ్య అవని | ప్రశాంతి | సుశీల | హరీశ్

పార్వతీపురం పట్టణం, బృందం, న్యూస్‌టుడే: సరైన మైదానాలు లేవు. సాధన చేసేందుకు అరకొర సౌకర్యాలు. అయినా సాధించాలన్న పట్టుదలకు ఇవేమీ అడ్డంకి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో మన్యం క్రీడా మెరికలు సత్తాచాటారు. వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచారు. అథ్లెటిక్స్ పోటీల్లోనూ పతకాలు కైవసం చేసుకొని ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా విజేతలను డీఎస్‌డీవో శ్రీధరరావు, స్పోర్ట్స్ సమన్వయకర్త, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వాసుదేవరావు నాయుడు, చంద్రమోహన్ తదితరులు అభినందించారు.

విజేతలు వీరే..: కరంజమ్మగూడకు చెందిన ఎస్.కస్తూరి.. 100 మీటర్ల (4*100) రిలేలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు, మెంటాడ మండలం గుర్ల తమ్మిరాజుపేటకు చెందిన దివ్య అవని.. 100 మీటర్ల పరుగులో వెండి, రిలేలో బంగారు పతకాలు పొందారు. గుమ్మలక్ష్మీపురంలో చదువుతున్న సీహెచ్ ప్రశాంతి, 100 మీటర్ల రిలేలో బంగారు, సౌత్‌జోన్ స్టేట్ మీట్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం పొందారు. బొడ్డగూడకు చెందిన బి.సుశీల 100 మీటర్ల రిలేలో బంగారు, పాచిపెంటకు చెందిన ఎం.హరీశ్ 800 మీటర్ల, 5కేఎం పరుగులో బంగారు పతకాలతో సత్తా చాటారు. హరీశ్ త్వరలో పాండిచ్చేరిలో జరగనున్న మీట్‌కు వెళ్లనున్నాడు.

అరకొర నీరు.. అవస్థలెలా తీరు?

పలాస నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికీ సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురవడంతో నేటికీ నాట్లు పడని పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న అరకొర వర్షాలకు వాగుల్లో చేరిన నీటిని ఆయిల్ ఇంజిన్లతో తోడి దమ్ము పడుతున్నారు. బుడంబొ వద్ద అరకొర నీటిలో ఆదివారం దమ్ము పడుతుండగా ట్రాక్టరు బురదలో కూరుకుపోయింది. దాన్ని మరో ట్రాక్టరుతో బయటకు నెట్టడానికి రైతులు అవస్థలు పడ్డారు.

– న్యూస్‌టుడే, మందస

ఎన్నాళ్లీ అసంపూర్తి నిర్మాణాలు ?

సారవకోట మండలం కేలవలసలో సచివాలయం నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు శ్లాబ్ వరకు పనులు పూర్తి చేసి అనంతరం బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో వదిలేశారు. దీంతో సిబ్బంది రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లుగా పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వీటి పేరు స్వర్ణ గ్రామ కార్యాలయాలుగా మార్చారే తప్ప అసంపూర్తి నిర్మాణాల గురించి పట్టించుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈఈ భార్గవి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

లబ్బ దారి.. అధ్వానంగా మారి!

కొత్తూరు మండలం లబ్బ పంచాయతీ కేంద్రానికి వెళ్లే గ్రామీణ రహదారి గులివిందలపేట నుంచి 2.4 కి.మీ మేర దారుణంగా మారింది. ఐటీడీఏ వసతి గృహం, జీసీసీ డిపో, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బందితోపాటు లబ్బ, కారిగూడ పంచాయతీల ప్రజలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో అంతా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రూ.80 లక్షలతో పనులకు ప్రతిపాదించామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

డంపింగుయార్డులా మార్చేశారు

బారువ మేజర్ పంచాయతీలో సేకరించిన వ్యర్థాలను గొల్లగండి రోడ్డుపై వేస్తున్నారు. కొంతకాలంగా సంపద తయారీ కేంద్రాన్ని వినియోగించకపోవడంతో నానాటికీ చెత్త పేరుకుపోతోంది. దీంతో తీరప్రాంత గ్రామాల ప్రజలు దుర్వాసనతోపాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే బారువ కాళికాదేవి ఆలయం ఉండటంతో భక్తులకూ అవస్థలు తప్పడం లేదు. దీనిపై బారువ ఈవో రాజేష్‌ను వివరణ కోరగా సంపద తయారీ కేంద్రం నిండిపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయని, రోడ్డుపై చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం పెద్దసీది పంచాయతీ పరిధిలోని 49, 50 పోలింగ్ బూత్‌లను తహసీల్దారు ఎన్.ప్రసాదరావు తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా బీఎల్వోలు పనిచేయాలని సూచించారు. వీఆర్వో లోకేశ్ ఉన్నారు.

తేరుకుంటున్న వరద పీడిత ప్రాంతాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వరదపీడిత ప్రాంతాలు తేరుకుంటున్నాయని, అత్యవసర శాఖల సిబ్బంది మరమ్మతులు చేపట్టారని, సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (భువనేశ్వర్, ఎస్‌ఆర్‌సీ) అధికార వర్గాలు సోమవారం సాయంత్రం జారీ చేసిన ప్రకటనలో తెలిపాయి. నదులు ప్రమాద స్థాయి దిగువ ప్రవహిస్తున్నాయని, ఎక్కడ వరద పరిస్థితి లేదని ప్రకటించాయి.

ధనరాజ తులసమ్మకు ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి కూడలి వద్ద కొలువైన ధనరాజతులసమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున మహిళలు పసుపు నీటితో అభిషేకించి కుంకుమ, సింధూరంతో పూజలు చేసి రజిత ముఖాన్ని అమ్మవారికి అలంకరించారు. అమ్మవారి దర్శనానికి ఒడిశాతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారులు తీరారు. గ్రామ చల్లదనం కోసం వివిధ ప్రాంతాల వారు అమ్మవారికి ఘటాలు సమర్పించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

విశాఖ డివిజన్‌లోకి తీసుకురావాలని డిమాండ్

విశాఖపట్నం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: రాయగడ డివిజన్‌లో పనిచేస్తున్న సుమారు 650 మంది వాల్తేరు డివిజన్ ఉద్యోగులను విశాఖ డివిజన్ పరిధిలోకి తీసుకురావాలని ఆయా ఉద్యోగుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిరిపురం ప్రాంతంలోని దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పడిన తరువాత కేవలం రెండేళ్లు రాయగడ డివిజన్‌లో పనిచేస్తే సరిపోతుందని, తర్వాత విశాఖ రైల్వే డివిజన్‌లోకి పంపిస్తామని అప్పట్లో రైల్వే అధికారులు చెప్పారన్నారు. రెండేళ్లయినా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. ఈ కారణంగా రైల్వేశాఖ సదుపాయాలను తాము అందుకోలేకపోతున్నామని వాపోయారు. వృద్ధులైన తల్లిదండ్రులను వైద్యం కోసం భువనేశ్వర్ తీసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దక్షిణ కోస్తా రైల్వేజోన్ అధికారులకు కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారని ఉద్యోగుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు

క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలు

క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుంటే ఉన్నత లక్ష్యాల వైపు పయనించొచ్చని విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.లీలా అన్నారు. పూండి సాయివినీత్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కైలాసరావు నేతృత్వంలో ఆదివారం స్వాగతోత్సవాలు నిర్వహించారు. ఉద్దానం యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల అధినేత కోదండరావు, వైస్ ప్రిన్సిపల్ సాయిగోపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో లీలా

అలరించిన విద్యార్థినుల నృత్యాలు

విలువల్ని సజీవంగా ఉంచేది సాహిత్యం

కొత్తూరు: విలువల్ని సజీవంగా ఉంచేది సాహిత్యమని కొత్తూరు రచయితల వేదిక(కొరవే)అధ్యక్షుడు కలమట శ్రీరాములు అన్నారు. స్థానిక విజ్ఞానభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో కొరవే సమావేశం నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ: కొత్తూరు: విజయనగరంలోని విజ్ఞానభారతి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమితి స్థాయి విజ్ఞాన మేళాలో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని కొత్తూరు విజ్ఞానభారతి స్కూల్ ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు. సీనియర్స్ విభాగంలో జి.శ్యామసుందర రావు, జి.జయంత్ కుమార్, కె.ధనంజయరావు, ఎ.రోషన్ కుమార్ వివిధ విభాగాల్లో సత్తాచాటారన్నారు.